ఉత్తమ టూరిజంగా తిరుపతి సీఎం చేతుల మీదుగా కలెక్టర్‌కు అవార్డు

ప్రజాశక్తి – తిరుపతి బ్యూరో

ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకుని రాష్ట్రంలోనే ఉత్తమ టూరిజంగా తిరుపతి ఎంపికయ్యింది. తిరుమల తిరుపతికి వస్తున్న యాత్రికుల నేపధ్యంలో తిరుపతి జిల్లాలో ఉన్న పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేసి టూరిస్టులకు ఆకర్షణీయ స్థలాలుగా నిలిచాయి. గుడిమల్లం, శ్రీకాళహస్తి, తలకోన, చంద్రగిరి కోట, నేలపట్టు, పులికాట్‌సరస్సు, తూపిలిపాలెం తదితర ఆలయాలను ఇటీవల కాలంలో కలెక్టర్ ఆధ్వర్యంలో అభివృద్ధి చేశారు. ఈ నేపధ్యంలో తిరుపతి టూరిజంకు ఉత్తమ అవార్డును రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. శనివారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సిఎం నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ వేదికలో పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఉన్నారు.

కార్పొరేట్ 'కాల యముళ్లు'

కనీస వేతనాలకై నిరసన (ఫైల్)

శ్రమే పెట్టుబడి..దోపిడే పరమావధి..!
కనీస వేతనాలకు నోచని శ్రామికులు
కన్నెత్తి చూడని కార్మిక శాఖాధికారులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

కార్పొరేట్ పరిశ్రమలు శ్రామికుల శ్రమను దోచుకుంటున్నాయి. కార్మికుల శ్రమే పెట్టుబడిగా...దోపిడే పరమావధిగా ముందుకెళ్తున్నాయి. ఇన్నాళ్ళూ శ్రామికుల శ్రమను దోచుకుంటున్న కా...పని గంటలు పెంచి రక్తాన్ని సైతం పీల్చేందుకు సిద్ధపడుతున్నాయి. పనిగంటల కాలపరిమితి పెరిగితే.. కార్మికవర్గం తమ సాంఘిక, కుటుంబ జీవితాన్ని కోల్పోతుందన్న కమ్యూనిస్టు పితామహుడు కార్ల్ మార్క్స్ సూత్రాన్ని తుంగలో తొక్కి ధనార్జనే ధ్యేయంగా శ్రామికుల జీవితాలను పణంగా పెడుతున్నాయి. పనిగంటల పెంపులో కార్పొరేట్ల చలికలకులను నిజం చేస్తూ రాష్ట్రంలోని మోడీ ఆధారిత కూటమి ప్రభుత్వం 13 గంటల పని విధానానికి శాసన మండలిలో ఏక వాక్య తీర్మానం చేసింది. కార్మిక చట్టాల్లో సడలింపు..లేబర్ కోడ్ కదింపుతో కార్మికులను కార్పొరేట్ పరిశ్రమల్లో మర యంత్రాలుగా మార్చేస్తున్నారు. తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తి-రేణిగుంట ఇండస్ట్రియల్ కారిడార్‌లో ఉన్న 45 పరిశ్రమల్లో మోడీ కార్పొరేట్ విధానాల కారణంగా శ్రామికులు తీరికే లేని కట్టుబానిసలుగా మిగలాల్సి వస్తోంది. శ్రామికుల శ్రమకు అండగా నిలబడాల్సిన కార్మిక శాఖాధికారులు పరిశ్రమల వైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు దారి తీస్తోంది.

కనీస వేతనాలకు నోచని శ్రామికులు

శ్రమ, సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న క్రమంలో 8గంటల పని, ఒత్తిడి తగ్గకపోగా, 13 గంటల పని విధానం తేవడం కార్పొరేట్-కూటమి కుటిల యత్నమే అని చెప్పాలి. పని గంటల పెంపుపై కార్మికులు అభద్రతా భావంతోనే తమ సమ్మతిని తెలపాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అలా అయినా పనికి తగ్గ వేతనాన్ని పరిశ్రమలు ఇస్తున్నాయా అంటే అదీ లేదు. ఉదాహరణకు రేణిగుంట ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్ కంపెనీలైన (ఈఎంసీ) ఎన్టీసీపీఎల్, యూటీఎల్‌పిఎల్, అపెక్స్ పరిశ్రమలు ఆరు నెలలుగా కార్మికుల శ్రమను దోచుకుంటున్నట్లుగా ఆరోపణలు వస్తున్నాయి. కార్మికుల చేత 12 గంటలు పని చేయించుకుంటూ శ్రమకు తగ్గ వేతనాన్ని ఇవ్వడం లేదన్న విమర్శలు ఉన్నాయి. 8 గంటల పని విధానంలో గంటకు రూ.70.34 పైసలు చెల్లించేవారు. భోజనం, విరామం, రవాణా, పీఎఫ్, ఈఎస్ఐ అన్నీ కలిపి నెలకు రూ.14,630 ఇచ్చేవారు. జూలై నుంచి 12 గంటల పని విధానాన్ని అమలులోకి తెచ్చిన యాజమాన్యాలు ఓటీ వేతనాలు ఇవ్వకుండా మోసం చేస్తున్నాయి. విరామ సమయాన్ని తీసేసి కేవలం 11 గంటలకు మాత్రమే వేతనాన్ని లెక్కిస్తున్నారు. 8 సాధారణ పని గంటల తర్వాత 4 అదనపు పని గంటలకు, గంటకు రూ.140 చెల్లించాల్సి ఉండగా నెలలో కేవలం 77 గంటలకు మాత్రమే ఓటీ వేతనం లెక్కిస్తున్నారు. అది కూడా 19 రోజులు ఓటీ డ్యూటీలు చేసిన తరువాత కూడా మిగిలిన రోజులు సక్రమంగా విధులకు వచ్చే వారికే ఓటీ వేతనాలు చెల్లిస్తున్నారు. సాధారణంగా నెలలో 26 రోజులు ఓటీ డ్యూటీలు చేసే కార్మికులకు రూ.30 వేలు చెల్లించాల్సి ఉంటుంది. అయితే యాజమాన్యాలు మాత్రం కేవలం రూ. 19 వేల లోపే వేతనాలు చెల్లిస్తున్నట్లు కార్మికులు వాపోతున్నారు. తక్షణ పరిశ్రమల్లోనూ మచ్చుకు ఇదే పరిస్థితి నెలకొంది.

మరీ అన్యాయం
అంజలి, కార్మికురాలు

పరిశ్రమల్లో పని చేసే కార్మికులకు ఉపాధి భద్రత లేదు. దాంతో యాజమాన్యాలు వారికి తోచిన విధంగా వేతనాలు చెల్లిస్తున్నారు. ప్రశ్నిస్తే తొలగిస్తున్నారు. 12 గంటలని చెప్పి 13 గంటలు పని చేయించుకుంటున్నారు. ఓటీ వేతనాలు సక్రమంగా ఇవ్వడం లేదు. ఇది మరీ అన్యాయం. గత్యంతరం లేక కంపెనీలకు పోతున్నాం.

8 గంటలే కొనసాగించాలి
అంగేరి పుల్లయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు

పరిశ్రమల్లో 8 గంటల పని విధానం కొనసాగించాలి. సమ్మతి మేరకే ఓటీలు వేయాలి. ఓటీ వేతనాలు పూర్తి స్థాయిలో అందించాలి. వారంలో ఒక రోజు వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలి. కార్మిక చట్టాలను ఉల్లంఘించే పరిశ్రమల యాజమాన్యాలపై కార్మిక శాఖ చర్యలు తీసుకోవాలి.

భళా..బ్రహ్మోత్సవ శోభ..!

- డ్రైఫ్రూట్ల మాలలతో స్నపన తిరుమంజనం
- నేటి 'గరుడసేవ'కు ఏర్పాట్లు సిద్ధం



శనివారం రాత్రి సర్వభూపాల వాహన సేవలో..

ప్రజాశక్తి - తిరుమల

కల్పవృక్ష వాహన సేవ వైభవంగా సాగింది. శనివారం ఉదయం శ్రీమలయప్ప స్వామి రాజమన్నార్ అలంకారంలో కల్పవృక్ష వాహనంపై భక్తులకు కటాక్షించారు. వాహనం ముందు గజరాజులు నడుస్తుండగా భక్తజనబృందాలు, భజనలు, కోలాటాలు, జీయంగార్ల ఘోష్ఠితో స్వామివారిని కీర్తిస్తుండగా మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి వాహన సేవ కోలాహలంగా జరిగింది.

తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీవారి ఆలయంలో డ్రైఫ్రూట్లు, రోజామాలల అలంకారంతో స్నపనతిరుమంజనం శోభాయమానంగా జరిగింది. ఆలయంలోని రంగనాయకుల మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ రకాల ఫలాలు, పుష్పాలతో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను అందంగా అలంకరించారు. బాదం, పిస్తా, కుంకుమపువ్వు, వట్టివేరు, పసుపు కొమ్ములు, ఎండు ద్రాక్ష, యాలకులు, తులసి, రోజామాలలతో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారి ఉత్సవమూర్తులను అలంకరించారు. వివిధ రంగుల పుష్పాలు, ఫలాలు, సాంబ్రాణి, ధూపదీప నైవేద్యాల నడుమ రంగనాయకుల మండపం నూతనత్వాన్ని సంతరించుకుంది. ఈ సందర్భంగా పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు కొబ్బరినీళ్ల తదితర సుగంధద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేశారు. వేదపండితులు చతుర్వేదపారాయణం ఆలపించారు. బ్రహ్మోత్సవాల సమయంలో వాహనసేవల్లో తిరువీధుల్లో ఊరేగి అలసిపోయే స్వామివారు స్నపనతిరుమంజనంతో సేద తీరుతారని ఆలయ అర్చకులు తెలిపారు. వేణుగోపాలదీక్షితులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో చిన్నజీయంగార్, టిటిడి ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ పాల్గొన్నారు.

గరుడసేవకు ఏర్పాట్లు పూర్తి

తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో ఐదో రోజున.. ఆదివారం గరుడ వాహన సేవ అత్యంత ముఖ్యమైనది.. సాయంత్రం 6.30 గంటల నుంచి గరుడ వాహనసేవ ప్రారంభమవుతుంది. ఈ గరుడ వాహన సేవకు భారీగా భక్తులు తరలివస్తారని అంచనా. గరుడ వాహన సేవను కనులారా దర్శిస్తే చాలు మోక్షం కలుగుతుందని భక్తుల నమ్మకం. తిరుమల శ్రీవారు గరుత్మంతునిపై ఆశీనులై తిరుమల మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిస్తారు. ఘాట్‌రోడ్లలో భక్తుల రద్దీ దృష్ట్యా శనివారం రాత్రి 9 గంటల నుంచి సోమవారం ఉదయం 6 గంటల వరకూ ద్విచక్రవాహనాలను తిరుమలకు అనుమతి ంచరు. తిరుపతిలోనూ ట్రాఫిక్ డైవర్షన్లు అమల్లోకి వస్తాయని ఎస్పీ సుబ్బారాయుడు తెలిపారు. తిరుపతి నుంచి తిరుమల వరకు ఏపీఎస్‌ఆర్టీసీతో పాటుగా టీటీడీ ప్రత్యేక బస్సులు నిరంతరం నడుపుతారని.. భక్తులు వీటిలో ప్రయాణించాలని సూచించారు.

భక్తులకు అన్నదానం

తిరుపతి నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ఆధ్వర్యంలో పెరటాసి మాసం, తిరుమల శనివారాలు రెండో రోజు, తిరుమలలో ఆదివారం జరగనున్న గరుడోత్సవం సందర్భంగా సరోజనీదేవి రోడ్డులోని సీతారామాంజనేయ స్వామి దేవస్థానంలో భక్తులకు ఆలయ నిర్వాహకులు ఆర్‌ఆర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కెవెల్ వర్మ, పంచాయతీరాజ్ డిఇ మురళి, రాధాక్రిష్ణ వర్మ, కులశేఖర్, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ లీలామనోహర్, సుబ్రమణ్యం, మునిబాబు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయ సిబ్బందికి వస్త్ర బహుమానం

శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో సేవలందిస్తున్న శ్రీవారి ఆలయ అర్చకులు, వేదపారాయణదారులు, ఇతర సిబ్బంది, పోటు సిబ్బంది, వాహనం బేరర్లు, మేళం సిబ్బంది, కల్యాణకట్ట క్షురకులకు శనివారం ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దంపతులు వస్త్ర బహుమానం అందజేశారు. తిరుమల వైభవోత్సవ మండపంలో టీటీడీ చైర్మన్ బి.ఆర్.నాయుడు చేతులమీదుగా వస్త్రాలను అందించారు.వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ గత ఎనిమిది సంవత్సరాలుగా బ్రహ్మోత్సవాల సిబ్బందికి వస్త్ర బహుమానం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీవారి ఆలయ పేష్కార్ రామకష్ణ, పోటు పేష్కార్ మునిరత్నం పాల్గొన్నారు.

ప్రతి భక్తునికి సేవలు అందాలి : జేఈవో

గరుడసేవకు విచ్చేసే లక్షలాది మంది భక్తులకు టిటిడి సేవలు అందించాలని టిటిడీ జేఈవో వి. వీరబ్రహ్మం కోరారు. ప్రత్యేక విధులలో భాగంగా గరుడ సేవకు వచ్చిన ఉద్యోగులు సమిష్టిగా భక్తులకు సేవలు అందించాలన్నారు. తిరుమలలోని ఆస్థాన మండపంలో శనివారం సాయంత్రం ఉద్యోగులు, శ్రీవారి సేవకులతో సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జేఈవో మాట్లాడుతూ, తిరుమల నాలుగు మాడ వీధుల్లోని గ్యాలరీల్లో భక్తుల సౌకర్యార్థం ప్రణాళిక బద్ధంగా ఏర్పాట్లు చేశామన్నారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, శ్రీవారి సేవకులు సమన్వయం చేసుకుని తిరుమలలోని గ్యాలరీలలోను, ఔట్ సైడ్ క్యూలైన్లు, వీక్యూసీ -2 క్యూలైన్లు, బయట ప్రాంతాలలో ప్రతి భక్తుడికి అన్నప్రసాదాలు, త్రాగునీరు, మజ్జిగ, బిస్కెట్లు తదితరాలు అందేలా ముందస్తుగా నిల్వ ఉంచుకుని ప్రణాళిక బద్ధంగా పంపిణీ చేయాలని సూచించారు. పరిష్కరించలేని సమస్య ఏదైనా తలెత్తితే తక్షణం ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. ఆదివారం ఉదయం నుండి గ్యాలరీలలోని భక్తులకు తాగునీరు, పాలు, అల్పాహారం అందించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, ఎస్‌పి సుబ్బారాయుడు, సిఈ టివి సత్యనారాయణ, ఎఫ్ఎ అండ్ సిఎఒ బాలాజీ పాల్గొన్నారు.

తిరుమల శ్రీవారికి శ్రీవిల్లి పుత్తూరుమాలలు

శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా గరుడసేవలో స్వామివారికి అలంకరించేందుకు తమిళనాడులోని శ్రీవిల్లిపుత్తూరు నుండి గోదాదేవిమాలలు శనివారం తిరుమలకు చేరుకున్నాయి. ముందుగా తిరుమలలోని శ్రీ బేడి ఆంజనేయస్వామి ఆలయం వద్ద గల పెద్దజీయర్ మఠానికి మాలలను తీసుకొచ్చారు. అక్కడ తిరుమల పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఆలయ మాడవీధుల గుండా మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా గోదాదేవి మాలలను శ్రీవారి ఆలయంలోకి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు దేవాదాయశాఖ జాయింట్ మారియప్పన్, ఈవో చక్కరై అమ్మాళ్ శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, శ్రీవిల్లిపుత్తూరు ఆలయ స్థానాచార్యులు రమేష్ రంగరాజన్ పాల్గొన్నారు.

ఐఐటిలో ఫేజ్-బి పనులు ప్రారంభం

రూ.2313 కోట్లు నిధులు కేటాయింపు
వర్చువల్‌గా ప్రధానిమోడీ శంకుస్థాపన

ప్రజాశక్తి - ఏర్పేడు

ఏర్పేడు ఐఐటి ఫేజ్-బి పనులకు ప్రధాని నరేంద్రమోడీ వర్చువల్‌గా శనివారం శంకుస్థాపన చేశారు. రూ.2,313 కోట్ల బడ్జెట్ ఆమోదించగా, నిర్మాణం కోసం 1243 కోట్లు, పరికరాలు, ఫర్నిచర్‌కు రూ.517 కోట్లు వెచ్చించనున్నారు. టెండర్ల కోసం ప్రస్తుతం ఫేజ్-బి డిజైన్లను ఖరారు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపి మద్దెల గురుమూర్తి, కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ హాజరయ్యారు. ప్లానింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డీన్ ప్రొఫెసర్ ఎ.మురళీకృష్ణ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఫేజ్-బిలో చేపట్టనున్న పనులను వివరించారు. ఎంపి గురుమూర్తి మాట్లాడుతూ తిరుపతి ఐఐటి స్థిరమైన సాంకేతికతతో కూడిన అత్యంత అందమైన క్యాంపస్‌లలో ఒకటని, అటువంటి క్యాంపస్‌ను అభివృద్ధి చేయడంలో దార్శనిక నాయకత్వానికి డైరెక్టర్ కెఎన్ సత్యనారాయణను ప్రశంసించారు. సెమీకండక్టర్లు, శక్తి నిల్వ వంటి రంగాలలో జరుగుతున్న ముఖ్యమైన పరిశోధన కార్యకలాపాలను హైలైట్ చేస్తూ ప్రాంతీయ పర్యావరణ వ్యవస్థకు మద్దతు ఇచ్చే పరిష్కారాలను అందించడానికి ఐఐటి తిరుపతి స్థానికంగా సంబంధిత సవాళ్లను చేపట్టాలన్నారు. కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ మాట్లాడుతూ ఐఐటి తిరుపతి అద్భుతమైన పురోగతి సాధిస్తోందని, ఫేజ్ బి నిర్మాణం గణనీయమైన విస్తరణ, మౌలిక సదుపాయాల అభివద్ధిని తెస్తుందన్నారు.చీఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బిఎస్ రెడ్డి, ఐఐటి ప్రాజెక్టు ఇన్‌ఛార్జి బ్రిగేడియర్ డాక్టర్ కృష్ణకుమార్ పాల్గొన్నారు.

ప్రతి గడపకూ జీఎస్టీ ఫలాలు అందాలి : కలెక్టర్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ప్రతి గడపకూ జీఎస్టీ ఫలాలు అందాలనికలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. శ్రీకాళహస్తి పట్టణంలో జిఎస్టి తగ్గింపుపై శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ వెంకటేశ్వర్ పలు దుకాణాల్లో జిఎస్టి తగ్గింపు అమలు తీరు పై తనిఖీ చేశారు. జిఎస్టి తగ్గింపు అమల్లో ఎదురవుతున్న సమస్యలను త్వరగా పరిష్కారం చేస్తామని, వస్తువులపై ఎమ్మార్పీ రేట్లు కూడా మార్పు చేసి జిఎస్టి తగ్గింపుతో వినియోగదారుడికి అందేవిధంగా చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. శ్రీకాళహస్తి ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ భవాని ప్రసాద్, శ్రీకాళహస్తి తహశీల్దార్ జనార్ధన రాజు, వాణిజ్య పన్నుల శాఖ అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సీనియర్ క్రికెట్ క్రీడాకారులకు ఉపాధి కల్పనే లక్ష్యం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

ఉమ్మడి చిత్తూరు జిల్లాలలోని సీనియర్ క్రికెట్ క్రీడాకారులకు ఉపాధి కల్పనే లక్ష్యంగా ఎంట్రీ లెవెల్ అంపైర్స్, స్కోరర్స్ నియామకానికి శ్రీకారం చుట్టామని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) జాయింట్ సెక్రెటరీ విజయ్ కుమార్(క్రికెట్ విజయ్) తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఓ ప్రైవేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఎంట్రీ లెవెల్ అంపైర్స్, స్కోరర్స్ రెండు రోజుల శిక్షణా శిబిరాన్ని ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో క్రికెట్ అన్ని ఫార్మేట్ లలో విజయం సాధిస్తుండడం శుభపరిణామం అన్నారు. రెండు రోజుల శిక్షణ అనంతరం జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఓ పరీక్ష విధానం ద్వారా కొంతమందిని సెలెక్ట్ చేయడం జరుగుతుందన్నారు. వారికి ఏసీఏ నిర్వహించే అంపైర్స్, స్కోరర్స్ పరీక్షలలో అర్హతను కల్పించడం జరుగుతుందని తెలిపారు. క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి రవి, కోశాధికారి గిరి ప్రకాష్, ఉపాధ్యక్షులు శ్రీనివాసమూర్తి, శ్రీధర్, జాయింట్ సెక్రెటరీ సతీష్ యాదవ్, సభ్యులు మురళి యాదవ్, కోలా హరిప్రసాద్ పాల్గొన్నారు.

తిరుపతిలో పిఎంజే జ్యువెలర్స్ గ్రాండ్ ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ దక్షిణాదిలో అత్యంత ప్రజాదరణ పొందిన జ్యువెలరీ బ్రాండ్ అయిన పీఎంజే జ్యువెలర్స్, తిరుపతిలోని తమ కొత్త స్టోర్‌ను తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మౌర్య ప్రారంభించారు. ఈ సందర్భంగా, బంగారు నగల ప్రియుల కోసం అక్టోబర్ 5వ తేదీ వరకు 9 రోజుల పాటు "బిగ్గెస్ట్ వెడ్డింగ్ హాఫ్-సారీ జ్యువెలరీ ఎగ్జిబిషన్" నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమానికి తిరుపతి మున్సిపల్ కమిషనర్ నారపురెడ్డి మౌర్య ఐఏఎస్ ముఖ్య అతిథిగా హాజరై స్టోర్‌ను ప్రారంభించారు. ఈ వేడుకలో పీఎంజే జ్యువెలర్స్ ఏపీ స్టేట్ హెడ్ హైదర్ అలీ, క్లస్టర్ మేనేజర్ కందకూరి అరవింద్ కుమార్, తిరుపతి స్టోర్ మేనేజర్ చంద్రబాబు పాల్గొన్నారు.

జ్యువెలరీ షోరూం ప్రారంభిస్తూ...

ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కెవి చౌదరి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఆంధ్రప్రదేశ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా తిరుపతికి చెందిన కెవి చౌదరిని ఎన్నుకున్నట్లు రాష్ట్ర నేతలు ప్రకటించారు. శనివారం విజయవాడలోని ఓ ప్రైవేట్ హోటల్లో ఫెడరేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. తిరుపతికి చెందిన కెవి చౌదరి గతంలో రాయలసీమ జోన్ ఛైర్మన్‌గా ఉన్నారు. తాజాగా రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు.

సామ్రాజ్యవాదాన్ని ఎదిరించడమే భగత్‌సింగ్‌కు నివాళి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని గడగడలాడించి భారతదేశ స్వాతంత్రం కోసం ఉరికంబాన్ని ముద్దాడిన విప్లవ యోధుడు భగత్ సింగుకు సిఐటియు కార్యాలయంలో నివాళి అర్పించారు.ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ నాడు బ్రిటీష్ సామ్రాజ్యాన్ని తరిమికొట్టామని, నేడు అమెరికన్ సామ్రాజ్యవాదులకు పాలకులు మోకరిల్లుతున్నారన్నారు. అమెరికన్ సామ్రాజ్యవాదాన్ని ఎదిరించడమే భగత్‌సింగ్‌కు మనం ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. మనుష్యులను చంపగలరేమో గానీ, వారి ఆశయాలను చంపలేరని చాటిచెప్పిన విప్లవవీరుడు సర్దార్ భగత్‌సింగ్ అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు కందారపు మురళి, టి సుబ్రమణ్యం,ఎస్.జయచంద్ర, ఎన్ మాధవకష్ణ, ఆర్ వెంకటేష్, జి బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌కు సిపిఎం నివాళి

'శిక్షణ' పేరుతో 'శిక్ష'..!

ప్రజాదృష్టి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

గ్రామీణ ప్రాంతంలో వైద్యసేవలు అందించడం సిహెచ్‌ఓల విధి. మరింత మెరుగైన వైద్యం అందించేందుకు పాలకులు వారికి శిక్షణ ఇవ్వాలని భావించారు. శిక్షణ పేరుతో బదిలీ శిక్ష వేశారు. లబోదిబో అంటూ బాధితులు ఉన్నతాధికారులకు చెప్పినా స్పందించకపోవడంతో ఆందోళనకు దిగారు. సిఐటియు మద్దతుతో పోరాడారు. కలెక్టర్ స్పందించి బాధితులకు ఉపశమనం కల్పించడం గమనార్హం.

గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో వైద్య సేవలు అందిస్తూ, గ్రామీణ ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్(సి హెచ్ ఓ)ది. తిరుపతి జిల్లాలో 570 మంది సిహెచ్‌ఓలు విధులు నిర్వహిస్తున్నారు. వీరందరూ కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేసే వారే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో పనిచేసే వీరికి 'టాటా డింక్' ద్వారా శిక్షణ ఇచ్చేందుకు ముఖ్యమంత్రి ఆదేశాలతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఆ శిక్షణా కేంద్రాన్ని ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గమైన కుప్పంలో ఆగమేఘాల పైన ఏర్పాటు చేశారు. శిక్షణ కోసం మొదట దఫాగా 60 మందిని ఎంపిక చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్వగ్రామమైన నారావారిపల్లిలోని సిహెచ్సికి చెందిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు కూడా ఉన్నారు. సీఎం స్వగ్రామం నుంచి సొంత నియోజకవర్గానికి శిక్షణ పేరుతో సెప్టెంబర్ మొదటి వారంలో పంపారు. వారందరూ 15 రోజులు టాటా డింక్ ద్వారా శిక్షణ తీసుకొని, తిరిగి వారి వారి సిహెచ్సిలో విధులు నిర్వహించాల్సి ఉంది. కానీ శిక్షణ పేరుతో అక్కడకు వెళ్లిన సిహెచ్‌ఓలకు బదిలీల శిక్ష వేశారు. శిక్షణ పూర్తయిన వారు తిరిగి వాళ్ళ సొంత సిహెచ్ సిలకు వెళ్లేందుకు అనుమతులు ఇవ్వకుండా కుప్పంలోనే పనిచేయాలంటూ ఆదేశించారు. తమ దగ్గర శిక్షణ తీసుకున్న వీరు తమ మధ్య పని చేయాలంటూ టాటా డింక్ షరతు పెట్టింది. ఇంకేముంది శిక్షణ కోసం వెళ్ళిన వాళ్ళు ఇల్లు వాకిలి పిల్లాపాపల్ని వదిలి అక్కడే విధులు నిర్వహించాల్సిన పరిస్థితి దాపురించింది. జిల్లా వైద్య శాఖ అధికారి (డిఎంఅండ్‌హెచ్ ఓ), జిల్లా కలెక్టర్కు విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోయింది. తప్పనిసరిగా కుప్పంలో విధులు నిర్వహించాల్సిందే, లేదంటే ఉద్యోగం నుండి పీకేస్తామంటూ బెదిరింపులకు దిగారు. మొదట దఫా శిక్షణకు వెళ్ళిన వారే కాదు, ఇకపై కుప్పంలోని టాటా డ్రింక్ కు శిక్షణకు వచ్చే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మూడు నుంచి ఆరు నెలలు పాటు అక్కడే విధులు నిర్వహించాలని, అనంతరం మరోచోటికి బదిలీ చేస్తామని టాటా డింక్ నిర్వాహకులు ఖరాకండిగా చెప్పారు. దీంతో బాధితులు లబోదిబోమన్నారు. విధిలేని పరిస్థితిలో రాత్రికి రాత్రే సీఐటీయు అండతో బాధితులు పోరుబాట పట్టారు. తిరుపతిలోని డిఎంహెచ్‌ఓ కార్యాలయం ఎదుట బాధితులందరూ బైఠాయించారు. రాత్రంతా అక్కడే నిరసన వ్యక్తం చేశారు. అయినా డిఎంహెచ్‌ఓ స్పందించలేదు. రెండు రోజులు పాటు రాత్రి పగలు మహిళలు సైతం నిరసనలో పాల్గొన్నారు. జిల్లా వైద్య శాఖ కార్యాలయానికి చెందిన సిబ్బంది సైతం విధులకు హాజరవ్వడానికి

కార్యాలయంలోనికి వెళ్లేందుకు ఇబ్బంది పడ్డారు. డిఎంహెచ్వో రెండు రోజులపాటు కార్యాలయానికి రాకుండా ముఖం చాటేశారు. బాధితుల పోరాటానికి ఎస్పీడీసీఎల్ విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల అసోసియేషన్, పలు విభాగాలకు చెందిన కాంట్రాక్టు, రెగ్యులర్ ఉద్యోగులు సంఘాలు మద్దతు పలికాయి. పోరాటం మరింత తీవ్ర రూపం దాల్చడంతో, మరో రెండు రోజుల్లో ముఖ్యమంత్రి బ్రహ్మోత్సవాల పర్యటన ఉండడంతో, ఎట్టకేలకు కలెక్టర్ స్పందించి బాధితులకు న్యాయం చేశారు. టాటా డింక్ సంస్థలో శిక్షణకు వెళ్ళిన సిహెచ్ వోలు ఎక్కడినుంచి శిక్షణకు వచ్చారో ఆయా ప్రాంతాల్లోని విధులు నిర్వహించుకునేలా ఆదేశాలు ఇచ్చారు. దీంతో బాధితులకు తాత్కాలిక ఉపశమనం లభించింది. సిఐటియు సహకారంతో బాధితులకు న్యాయం జరగడంతో వారు ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులోనూ వీరికి సమస్య వస్తే అండగా ఉంటామని నాయకులు ప్రకటించారు. భవిష్యత్తులో శిక్షణ కెళ్లే సిహెచ్‌ఓలకు ఇలాంటి సమస్య రాకుండా చూడాలని జిల్లా ఉన్నతాధికారులను కోరుతున్నారు.

ఆసుపత్రి పడకలు పెంచుతూ ఉత్తర్వులు

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి మండలం, నారావారిపల్లెలో ప్రస్తుతమున్న 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను 50 పడకలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఆస్పత్రిని 50 పడకలకు పెంచుతూ అదనంగా 18 పోస్టులు ఏర్పాటు చేయాలని గత నెల 19న ఏపీ స్టేట్ సెకండరీ హెల్త్ విభాగం డైరెక్టర్ ప్రభుత్వానికి ప్రతిపాదించారు. దీనిపై కసరత్తు చేసిన ప్రభుత్వం రాష్ట్రంలోని 50 పడకల కమ్యూనిటీ ఆస్పత్రుల్లో సిబ్బంది సంఖ్యను సమీక్షించి సర్దుబాటు చేసింది. అందులో భాగంగా డెంటల్, గైనిక్, పీడియాట్రిక్స్, ఈఎన్టీ, ఆప్తాలజీ వంటి తొమ్మిది విభాగాలకు చెందిన వైద్యుల పోస్టులను, నాలుగు కింది స్థాయి సిబ్బంది పోస్టులను, ఐదు స్టాఫ్ నర్సు పోస్టులను నారావారిపల్లెకి సర్దుబాటు చేసింది. మొత్తం 18 అదనపు పోస్టులతో నారావారిపల్లె ఆస్పత్రిని 50 పడకలకు పెంచుతూ శుక్రవారం రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి సౌరభ్ గౌర్ ఉత్తర్వులు జారీ చేశారు.

నేటి నుండి డిగ్రీ కళాశాలలకు దసరా సెలవులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : యస్వీయు పరిధిలో, ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలన్నింటికీ దసరా సెలవులను 28వ తేదీ నుండి అక్టోబర్ 5వ తేదీ వరకు మంజూరు చేశారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమౌళి తెలిపారు. అక్టోబర్ 6న రీఓపెన్ అవుతాయన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమాలపేట మండలం, ఎస్‌బిఆర్ పురం గ్రామ పంచాయితీలో గ్రామాన్ని దత్తత చేసుకున్న సందర్భంగా ఆదివారం అమెరికాకు చెందిన అడాప్ట్ ఏ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్ వారిచే ఉచిత వైద్య శిబిరాన్ని ఆ సంస్థ ఫౌండర్ పండేటి భూపతిరాజు సహకారంతో నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ మణి రాజు తెలిపారు. స్థానిక ఎంపీపీ పాఠశాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరుగుతుందని, గుండె, కంటి, ఎముకలు, చిన్న పిల్లల జనరల్ వైద్యులు, క్యాన్సర్, నరముల వ్యాధులకు సంబంధించిన వైద్యులు విచ్చేయుచున్నట్లు తెలిపారు. ఈఅవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముగిసిన వ్యక్తిత్వ వికాస శిక్షణ

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాలలో ఆరు రోజులు పాటు నిర్వహించిన వ్యక్తిత్వ వికాస, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై విద్యార్థినీ, విద్యార్థులకు ఇచ్చిన శిక్షణ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.రెడ్డిశేఖర్ మాట్లాడుతూ విద్యార్థుల కెరియర్ డెవలప్మెంట్‌కు ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్లేస్మెంట్ సెల్ ఇంచార్జ్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, విద్యార్థి వ్యవహారాల ఇంచార్జ్ డాక్టర్ హరిప్రసాద్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విమలకు పవర్ ఆఫ్ ఉమెన్ అవార్డ్

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి, హోటల్ రెగాలియాలో శనివారం ఎవర్‌గ్రీన్ 8వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పవర్ ఆఫ్ ఉమెన్ అవార్డ్స్-2025 కార్యక్రమం నిర్వహించారు. విద్య, వైద్యం, అందం, ఆరోగ్యం వంటి రంగాల్లో విశేష కృషి చేస్తున్న మహిళలకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ వేడుకలో ఆర్.కె. గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ డైరెక్టర్ ఆర్.కె. విమల "విద్యా అవార్డు" అందుకున్నారు. ఉపాధ్యాయినిలు రూప, స్వప్న, మయూరి, వినయశ్రీలు అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆర్.కె. రెడ్డి మాట్లాడుతూ మహిళలు ప్రతి రంగంలోనూ ప్రతిభ కనబరుస్తున్నారు. నిర్వాహకులు మహేష్ మాట్లాడుతూ మహిళల పాత్ర సమాజ అభివృద్ధికి మూలస్తంభ మన్నారు. అవార్డు ప్రదానం చేసిన పసుపులేటి శివ ప్రసాద్ మాట్లాడుతూ వివిధ రంగాలలో ముందంజలో ఉండే మహిళలను ప్రోత్సహించడం జరిగిందని తెలిపారు.

నిధులు మంజూరు చేయండి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణ శివారులోని పంబ లేరు వంతెన నిర్మాణాన్ని గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిం దని, నిధులు మంజూరు చేసి వంతెన నిర్మాణానికి సహకరిం చాలని సీఎం చంద్రబాబును ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ కోరారు. శనివారం ఆయన విజయవాడలో సీఎంను కలిశారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి శనివారం పలువురు ప్రముఖులు విచ్చేశారు. సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ, మధ్యప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి రాజేంద్ర శుక్ల కుటుంబ సమేతంగా దర్శించుకున్న వారిలో ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు సాంప్రదాయ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

పేదరిక నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, కోర్టు మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో కోర్టు ప్రాంగణంలో శనివారం పేదరిక నిర్మూలన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడవ అదనపు జిల్లా జడ్జి వెంకట నాగ పవన్ మాట్లాడుతూ అట్రాసిటీ యాక్ట్, పేదరిక నిర్మూలన గురించి అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి రాజేష్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి చరణ్ రాణి, ప్యానెల్ అడ్వకేట్ మహబూబ్ బాషా, గూడూరు బార్ మెంబెర్స్, కోర్టు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత టైలరింగ్ శిక్షణ

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి, ద్వారకానగర్‌లోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో అక్టోబరు 3వ తేదీ నుంచి 31 రోజుల పాటు మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ సురేష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన తిరుపతి, చిత్తూరు జిల్లాల గ్రామీణ ప్రాంతానికి చెందిన 19 నుంచి 40 సంవత్సరాల మధ్య కలిగిన పది చదివిన మహిళలు అర్హులన్నారు. వివరాలకు 7989680587, 94949 51289 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

అటవీ భూమి ఆక్రమణ

చదును చేస్తున్నా.. చోద్యం చూస్తున్న అటవీశాఖ అధికారులు

ప్రజాశక్తి - బాలాయపల్లి: మండలంలోని నిలమనూరు పంచాయతీ పరిధి, గొల్లగుంటలో అటవీ భూమి కబ్జాకు గురవుతోంది. వెంకటగిరి-నాయుడుపేట రహదారికి సమీపంలోని భూమి కావడంతో లక్షల రూపాయలు విలువ చేస్తుంది. దీంతో ఆక్రమణదారుల కన్ను ఈ భూమిపై పడింది. పగలు రాత్రి తేడా లేకుండా గత మూడు రోజులుగా ఆక్రమణ దారులు ఎక్స్కవేటర్‌తో మొక్కలు తొలగించి చదును చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అటవీశాఖ అధికారులు అటువైపు తొంగి చూడడం లేదు. పేద ఎస్సీలు సాగుచేసుకుంటున్న భూమిని, తమ భూములంటూ అడ్డుకునే అటవీశాఖ అధికారులు ఈ కబ్జాదారుల విషయంలో మౌనం వహించడం పలు అనుమానాలకు తావిస్తోంది. సుమారు పది ఎకరాల పైబడి భూమిని చదును చేస్తున్నా పట్టించుకోకపోవడం చూడడంపై పలు రకాల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ భూమి ఆక్రమిస్తున్నారని విఆర్‌ఓ సమాచారం రావడంతో వెళ్లి పరిశీలించగా ఆక్రమణదారులు రెవెన్యూ భూములు కావు అటవీశాఖకు చెందిన భూములని చెప్పారు. అటవీశాఖ అధికారులతో సన్నిహితంగా ఉండే ఓ వ్యక్తి దగ్గర ఉండి చదును చేయిస్తున్నాడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఆక్రమణలను అడ్డుకొని అటవీ భూములను కాపాడాలని కోరుతున్నారు.

మన ముక్క మంచిదేనా..?



ఆదివారమొస్తే.. చాలు.. ఇంటిల్లపాది ఎదురు చూసేది ముక్కను చటుక్కున నోట్లో వేసుకుని గుటుక్కున మింగేద్దామని.. ఆత్రం బాగానే ఉన్నా.. ఏమాత్రం జాగ్రత్త లేకుంటే అనారోగ్యం పాలేనన్నది సత్యం.. మార్కెట్‌కు వెళ్లి తెచ్చే ముక్క నాణ్యత ఎంతన్నదే ప్రశ్నార్థకం..!

- మాంసం దుకాణాల్లో నాణ్యత లోపం
- అధికారుల తనిఖీలు శూన్యం
- అనారోగ్యంపై స్థానికుల ఆందోళన

ప్రజాశక్తి - వెంకటగిరి: వెంకటగిరి మున్సిపాలిటీ పరిధిలో మాంసం విక్రయాలకు సంబంధించి విక్రయదారులు నిబంధనలు పాటించడం లేదు. జీవాలు ఆరోగ్యకరమైనవా లేదా అనేది పరీక్షించకుండానే ఇష్టారాజ్యంగా వధిస్తూ మాంసం విక్రయాలు చేపడుతున్నారు. వధశాలలో జీవాలను వధించి పరిశుభ్రమైన ప్రాంతాల్లోని దుకాణాల్లో విక్రయించాల్సి ఉన్నప్పటికీ ఆ నియమాలు పాటించడం లేదు. పట్టణంలో దాదాపు 30 నుంచి 40 వరకు మాంసం విక్రయ దుకాణాలున్నాయి. కొందరు మాంసం విక్రయదారులు దుకాణాల్లో విక్రయించగా, మరికొంత మంది రోడ్లపై, మురుగు కాలువల పక్కన, దుమ్ముధూళి, ఆపరిశుభ్ర వాతావరణంలో విక్రయాలు చేస్తున్నారు. అయినా మున్సిపల్, పశు వైద్యాధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నిబంధనలు గాలికి..

నిబంధనల ప్రకారం జీవాలను మాంసం విక్రయదారులు జంతు వధశాలల్లో వధించాలి. పట్టణంలో ఆ ఏర్పాట్లు లేకపోవడంతో చాలా వరకు మాంసం విక్రయదారులు ఇంటి వద్దనే జీవాలను వధించి తెచ్చి విక్రయాలు చేస్తున్నారు. ఇళ్ల సమీప ప్రాంతాల్లో దుర్వాసన రావడంతో ప్రజల నుంచి అభ్యంతరాలు వస్తున్నాయి. విక్రయించే మాంసం నాణ్యమైనదేనని పశువైద్యులు ధ్రువీకరించాల్సి ఉన్నప్పటికి ఆ నిబంధనల పాటింపు ఎక్కడా జరగడం లేదు. రోగాలబారిన పడినవి, వయస్సు పైబడిన జీవాలను వధించి విక్రయిస్తున్నారనే విమర్శలు స్థానికుల్లో వెల్లువెత్తుతున్నాయి. పట్టణంలో నిత్యం క్వింటాళ్ల కొద్దీ మాంసం విక్రయాలు జరుగుతుంటాయి. ఆదివారం, బుధవారం వందల సంఖ్యలో జీవాలను వధించి పెద్ద ఎత్తున మాంసం విక్రయాలు చేస్తుంటారు. పట్టణంలో మిగతా రోజుల్లో తక్కువ మొత్తంలో విక్రయాలు జరుగుతుంటాయి. ఇంత పెద్ద ఎత్తున మాంసం వ్యాపారం జరుగుతున్నప్పటికీ ఏ ఒక్కసారి జీవాల ఆరోగ్యంపై, మాంసం విక్రయాలు, దుకాణాల్లో పారిశుధ్య చర్యలు వంటి వాటిపై మున్సిపల్, పశుసంవర్ధకశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించిన దాఖలాలు లేవు.

వర్షాకాలంలో జీవాలకు వ్యాధులు..

ప్రస్తుతం వర్షాకాలం ఆరంభం కావడంతో జీవాలు వివిధ రకాల వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంది. అలాంటి వాటి మాంసం విక్రయాలతో ప్రజల ఆరోగ్యంపై ప్రభావం పడనుంది. పశుసంవర్ధక శాఖ అధికారులతో కలిసి మున్సిపల్ అధికారులు మాంసం దుకాణాలను తనిఖీ చేసి నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకొని ప్రజారోగ్యం కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. మాంసం విక్రయదారులతో మున్సిపల్ అధికారులు సమావేశం నిర్వహించి దుకాణాల్లో పరిశుభ్ర వాతావరణం నెలకొనేలా తగు సూచనలు ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.



తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకుంటాం

మాంసం విక్రయాలపై ఇటీవల జరిగిన వెంకటగిరి పోలేరమ్మ జాతర సందర్భంగా పశుసంవర్ధకశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. పట్టణంలో జంతువుల శాలల నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. బహిరంగంగా జీవాలను వధించినా, అపరిశుభ్ర వాతావరణంలో, అనారోగ్యంబారిన పడిన జీవాల మాంసం విక్రయిస్తే తగిన చర్యలు తీసుకుంటాం.

- వెంకటరామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్, వెంకటగిరి

విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని రైతులకు 75 శాతం రాయితీ ధరలపై మొక్కజొన్న, జొన్న గడ్డి విత్తనాలను పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉంచినట్లు పశు వైద్యాధికారి డాక్టర్ ముని రాజా పేర్కొన్నారు. కేజీ మొక్కజొన్న విత్తనాల ధర 68 రూపాయలు కాగా, ఇందులో 51 రూపాయలు సబ్సిడీ పోను రైతుల కేజీకి 17 రూపాయలు చెల్లించాలన్నారు. జొన్న గడ్డి విత్తనాలు ఒక కిలో 92 రూపాయలు కాగా ఇందులో సబ్సిడీ 69 రూపాయలు ఫోను ఒక కిలోకు 23 రూపాయిలు చెల్లించాలన్నారు. ప్రస్తుతం జొన్న గడ్డి విత్తనాలు 500 కిలోలు, మొక్కజొన్న గడ్డి విత్తనాలు 1000 కిలోలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆధార్ కార్డు తీసుకొచ్చి విత్తనాలను తీసుకోవచ్చున్నారు. ఈ సదవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజాశక్తి - వాకాడు: తిరుపతి జిల్లా, వాకాడు మండల పశువైద్యాధికారి డాక్టర్ కృష్ణారావు వాకాడు పశువుల ఆసుపత్రిలో 75% రాయితీతో మొక్కజొన్న, జొన్న గడ్డి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆధార్ కార్డు ద్వారా సబ్సిడీ ధరలతొ మొక్కజొన్న, జొన్న గడ్డి విత్తనాలను తీసుకోవచ్చని, ఈ అవకాశాన్ని పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టలోని స్థానిక పురపాలక సంఘ కౌన్సిల్ సాదారణ సమావేశం సోమవారం ఉదయము 11.00 గంటలకు పురపాలక సంఘం కార్యాలయ సమావేశ మందిరంలో, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ల అధ్యక్షతన జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ మంజునాథ గౌడ తెలిపారు. కావున గౌరవ వైస్- చైర్ పర్సన్స్, వార్డు, కో-ఆప్షన్ సభ్యులు తప్పక హాజరుకావలని తెలిపారు.

అసంపూర్తిగా రైతు భరోసా కేంద్ర భవనం

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: తిరుపతి జిల్లా, బుచ్చినాయుడు కండ్రిగ మండలం, ఆలత్తూరు సచివాలయాన్ని ఇంచార్జ్ ఎంపీడీవో మోతి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సచివాలయం పరిధిలో నిర్మాణంలో ఉన్న రైతు భరోసా కేంద్ర భవనం పనులు అసంపూర్తిగా ఉండటాన్ని గమనించారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు చేరాలని, వెంటనే భవన నిర్మాణ పనులను ప్రారంభించలని ఆమె అధికారులకు సూచించారు.

ఉపాధి పనుల పరిశీలన

ఆలత్తూరు పంచాయతీలో ఉపాధి హామీ పనులలో బాగంగా చేపట్టిన ఫారం పాండ్ పనులను ఎంపీడీవో శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ తమ పొలాల్లో ఫారం పాండ్లు తవ్వుకుంటే జలాలు వృద్ధి చెందడమే కాక, పంటకు మేలు చేసే మిత్ర పురుగులు వృద్ధి చెందుతాయన్నారు. అనంతరం ఉపాధి హామీ శ్రామికులతో మాట్లాడుతూ నిర్ణయించిన ప్రకారం కొలతలతో పనిచే ఉపాధి పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ పథక సంచాలకులు సరిత, అదనపు కార్యక్రమాదికారులు అవిలాల దేవరి తదితరులు పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్ష దరఖాస్తుకు గడువు అక్టోబర్ 7

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి, వరదరాజనగర్, విశ్వం స్కూల్‌లో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సుకు విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో విశ్వం విద్యా సంస్థల అధినేత, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు డా.యన్.విశ్వనాథ రెడ్డి మాట్లాడుతూ తిరుపతి విశ్వం విద్యా సంస్థల్లో విద్యార్థులకు సైనిక్, నవోదయ, మిలిటరీ స్కూల్స్ ఎంట్రన్స్ టెస్ట్‌లకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. శిక్షణ పొందినవారు ఉత్తమ ర్యాంకులు సాధిస్తున్నారని తెలిపారు. 2025 విద్యా సంవత్సరానికి జాతీయ స్థాయిలో 6, 9వ తరగతిలో ప్రవేశానికి జరిగిన ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ టెస్ట్ ప్రవేశ పరీక్ష ఫలితాలోను తిరుపతి విశ్వం విద్యార్థులు రాష్ట్ర స్థాయి మొదటి ర్యాంకుతో, 66 సీట్లు సాధించారన్నారు. 2026-2027 విద్యా సంవత్సరంలో 9, 11వ తరగతిలో నవోదయ ప్రవేశ పరీక్ష దరఖాస్తులకు చివరి తేదీ అక్టోబర్ 7 అని తెలిపారు. వివరాలకు 8688888802 / 9399976999 ఫోన్ నంబర్లను లేదా విశ్వం సైనిక్ నవోదయ పోటీ పరీక్షల కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు.

డాక్టర్ వెంకటేష్ మృతికి సంతాపం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: స్విమ్స్ జనరల్ సర్జరీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వెంకట కిషోర్ గుంటూరు దగ్గర జరిగిన ప్రమాదంలో గురువారం మృతి చెందారు. ఆయన మృతి పట్ల శనివారం స్విమ్స్ పాత డైరెక్టర్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సంతాప సభలో పలువురు నివాళి అర్పించారు. నివాళి అర్పించిన వారిలో స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డాక్టర్ ఆర్.వి. కుమార్, స్విమ్స్ డీన్ డాక్టర్ అలోక్ సచన్, రిజిస్ట్రార్ డాక్టర్ అపర్ణ ఆర్ బిట్లా, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, ఆర్.ఎం.ఓ. డాక్టర్ కోటి రెడ్డి, స్విమ్స్ జనరల్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ ముత్తీశ్వరయ్య, జనరల్ సర్జరీ విభాగపు వైద్యులు, వివిధ విభాగాధిపతులు, స్విమ్స్ ఉద్యోగులు ఉన్నారు.

అన్నా సంధ్యాను పరామర్శించిన ఎమ్మెల్యే ఆరణి

ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కార్పొరేటర్ అన్నా సంధ్యాను శనివారం మధ్యాహ్నం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని డాక్టర్స్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఆమె కోలుకుంటున్నట్లు డాక్టర్స్ ఎమ్మెల్యేకు వివరించారు.

వైసీపీ తిరుగులేని శక్తిగా ఎదుగుతోంది

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: వైసీపీ తిరుగులేని శక్తిగా ఎదుగుతోందని పార్టీ రాష్ట్ర కో ఆర్డినేటర్ సజ్జల రామకష్ణారెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో వైసీపీకి 18 లక్షలు మంది క్రియాశీలక సైన్యం ఉందని ధీమా వ్యక్తం చేశారు. చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజక వర్గం సదుం మండలం యర్రాతివారిపల్లెలో శనివారం వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అధ్యక్షతన పుంగనూరు నియోజకవర్గం విస్తత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకష్ణారెడ్డి, తిరుపతి, చిత్తూరు జిల్లా అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి, మాజీ మంత్రి నారాయణస్వామి, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల నియోజకవర్గాల సమన్వయకర్తలు, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారక నాథ్ రెడ్డి, ఆకేపాటి అమరనాథ్ రెడ్డి, నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి, గడికోట శ్రీకాంత్ రెడ్డి, చింతల రామచంద్రారెడ్డి, నిసార్ అహ్మద్, వెంకటేగౌడ్, డాక్టర్ సునీల్‌కుమార్, విజయానందరెడ్డి, నూకతోటి రాజేష్, బియ్యపు మధుసూదన్‌రెడ్డి, విద్యార్థి విభాగం అధ్యక్షులు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి సహా పలువురు నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సజ్జల మాట్లాడుతూ..'ప్రజలకు సంక్షేమం అందించడమే అజెండాగా జగన్ పాలన సాగిందన్నారు. రాబోయే జగన్ పాలనలో కార్యకర్తలకే ప్రాధాన్యత ఉంటుందన్నారు. టీడీపీ కమిటీలు దోచుకోవడమే లక్ష్యంగా పనిచేస్తున్నాయని ధ్వజమెత్తారు. ఓట్లను తొలగించడం, వ్యవస్థలను మేనేజ్ చేయడం చంద్రబాబుకు తెలుసునని, ప్రతీ వైసీపీ కార్యకర్త అప్రమత్తంగా ఉండాలని, బూత్ లెవల్‌లో నిత్యం పరిశీలిస్తూ ఉండాలని సూచించారు. వైసీపీ రీజనల్ కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. పార్టీ అధినేత వైఎస్ జగన్ ఆదేశాలు మేరకు గ్రామ స్థాయి కమిటీలు ఏర్పాటు చేశామని, గ్రామ కమిటీలకే పూర్తి బాధ్యత అప్పగిస్తామని తెలిపారు. భూమన కరుణాకరరెడ్డి మాట్లాడుతూ.. జగనన్న మాటగా మీరు గ్రామస్థాయిలో తీసుకు వెళ్లాల్సిన బాధ్యత కమిటీలపై ఉందన్నారు. ఆకేపాటి అమరనాథ్ రెడ్డి మాట్లాడుతూ.. గతంలో జరిగిన పొరపాట్లు ఈసారి జరగనివ్వమని తెలిపారు. మాజీ మంత్రి నారాయణస్వామి మాట్లాడుతూ.. ఈవీఎంల గాలిలో కూడా పుంగనూరు ప్రజలు పెద్దిరెడ్డిని గెలిపించారన్నారు. మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాకు ఆదర్శమని తెలిపారు.

అఖిల భారత మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : డిసెంబర్ 31, నుంచి 2026 జనవరి 4 వరకూ ఐదు రోజులపాటు విశాఖపట్నంలో జరగనున్న సి.ఐ.టి.యు అఖిలభారత 18వ మహాసభలను జయప్రదం చేయాలని గూడూరు పట్టణ సి.ఐ.టి.యు పట్టణ ప్రధాన కార్యదర్శి బి.వి రమణయ్య పిలుపు నిచ్చారు. జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శనివారం చిల్లకూరు మండల పరిధిలోని, తిక్కవరం సెక్టార్ అంగన్వాడి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమం అంగన్వాడి అధ్యక్ష, కార్యదర్శులు ఇంద్రావతి, ప్రభావతిల ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ముని కుమారి, ఆసియా బేగం, కమిటి సభ్యులు లక్ష్మి, మానస తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలను అందిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడతాం

ప్రజాశక్తి - వెంకటగిరి: కూటమి ప్రభుత్వానికి రాష్ట్రమంతా వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని, ఎన్నికలు వస్తే మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేసుకునేందుకు రాష్ట్ర ప్రజలు ఎదురు చూస్తున్నారని వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన పోలేరమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వెంకటగిరి మున్సిపాలిటీ 23వ వార్డు కౌన్సిలర్ ఆటంబాకం శ్రీనివాసులు రెడ్డి ఇటీవల అనారోగ్యానికి గురి కావడంతో ఆయనను పరామర్శించారు. వ్యక్తిగత పనుల కారణంగానే జాతర సమయంలో అమ్మవారిని దర్శించుకోలేకపోయాన్నారు. వెంకటగిరి మున్సిపాలిటీ నిధులు రూ.40 లక్షలకు పైగా జాతరకు వినియోగిస్తూ ఆ మున్సిపాలిటీ కౌన్సిలర్లకు కనీస మర్యాద ఇవ్వకపోవడం ఆరుణమన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యేలకు స్పీకర్ అభినందన

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతిలో 14,15 తేదీల్లో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా సాధికారత సదస్సుకు హాజరైన పలు రాష్ట్రాల నుంచి విచ్చేసిన ప్రజా ప్రతినిధులకు ప్రారంభం నుంచి చివరి వరకు ఎలాంటి లోటు పాట్లు లేకుండా చూసి, శాంతిభద్రతలతో జాతీయ సదస్సును విజయవంతం చేసినందుకు శాసన సభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్, ఎస్.పి సుబ్బరాయుడు, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, తిరుపతి మున్సిపల్ కమిషన్ మౌర్య, స్థానిక తిరుపతి శాసన సభ్యులు ఆరణి శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు పులివర్తి నాని, బొజ్జల సుధీర్ రెడ్డి, తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డికి అభినందనలు తెలిపారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి అనంత లా కళాశాల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఓ ప్రైవేటు హోటల్లో జరిగిన ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా ఛైర్మన్ అనంత రవి, మూడవ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి ఎం గురునాథ్, ఐదవ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి రాంగోపాల్ హాజరై విద్యార్థులకు అనంత రాజమ్మ మెమోరియల్ గోల్డ్ అండ్ సిల్వర్ మెడల్స్‌ను, మెరిట్ స్టూడెంట్స్‌కు అందించారు. ఆయన మాట్లాడుతూ న్యాయవాద వృత్తి ఎంతో కీలకమని, సమాజ సేవే లక్ష్యంగా నిబద్ధతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సిరి కుమార్, వైస్ ప్రిన్సిపాల్ శారదా, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్రీనివాసులు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగ్గా చేపట్టాలి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: చిన్న మున్సిపాలిటీల్లో సైతం పారిశుద్ధ్యం మెరుగ్గా చేపట్టేలా సహకరిస్తామని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా ఐదు చిన్న మున్సిపాలిటీల కమిషనర్లు, నగరపాలక సంస్థ అధికారులతో శనివారం కమిషనర్ సమావేశమై ఒప్పందం కుదుర్చుకున్నారు. ప్రస్తుతం ఆయా మున్సిపాలిటీల్లో ఉన్న వసతులు, కల్పించాల్సిన వసతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ చెత్త నిర్వహణ వంద శాతం చేస్తున్నామన్నారు. శనివారం స్వచ్ఛ సాగర్ జోడి నిర్వహించాన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన తిరుపతితో కుప్పం, మడకశిర, మైదకూరు, కమలాపురం, జమ్మలమడుగు మున్సిపాలిటీలలో పారిశుద్ధ్య నిర్వహణ మెరుగ్గా ఉండేలా సహకరిస్తామన్నారు. అనంతరం తూకివాకం వద్ద నిర్వహిస్తున్న చెత్త నిర్వహణ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హెల్త్ కమిషనర్ డాక్టర్ యువ అన్వేష్, వివిధ మున్సిపాలిటీల కమిషనర్లు పాల్గొన్నారు.

రేపు డప్పు కళాకారుల జిల్లా మహాసభ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: 29న శ్రీకాళహస్తి, మహేష్ కళ్యాణ సదన్ వేదికగా జరిగే డప్పు కళాకారుల సంఘం తిరుపతి జిల్లా ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు పెంచలయ్య విజ్ఞప్తి చేశారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో శనివారం డప్పు కళాకారుల సంఘం జిల్లా స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. రాష్ట్ర స్థాయి ముఖ్య నేతలు హాజరుకానున్న ఈ సమావేశాల్లో డప్పు కళాకారుల సమస్యలపై ఉద్యమ కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు అంగేరి పుల్లయ్య, సంక్రాంతి వెంకటయ్య, గెడి వేణు, గంధం మణి, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాషువా జయంతి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: సమాజంలోని అసమానతలపై గుర్రం జాషువా రాజీలేని పోరాటం చేశారని డాక్టర్ చంద్రమౌళి పేర్కొన్నారు. గుర్రం జాషువా జయంతిని పురస్కరించుకొని పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తెలుగు విభాగం ఆధ్వర్యంలో శనివారం జాషువా జయంతి సభను నిర్వహించారు. ఈ సభలో కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ దళిత కుటుంబంలో జన్మించిన జాషువా అంటరానితనం అనే దురాచారం వల్ల అనేక బాధలు ఎదుర్కొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ పి. వెంకటేశన్, డాక్టర్ మన్యం నరసింహులు పాల్గొన్నారు.

సుధాకర్ ప్రసాద్ సేవలు ఎనలేనివి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా రెవిన్యూ శాఖకు, సంఘానికి తోట సుధాకర్ ప్రసాద్ ఎనలేని సేవలను అందించారని వక్తలు పేర్కొన్నారు. 24వ వర్ధంతి పురస్కరించుకుని శనివారం ఆయన జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శివప్రసాద్, రూపచంద్, అవోక్‌రెడ్డి, భాస్కర్, ఉషారాణి, వెంకటరమణ, పవన్, మాధవి పాల్గొన్నారు. ఈ పుస్తకం కొత్త తరం రెవెన్యూ ఉద్యోగులకు స్ఫూర్తిదాయకమన్నారు.

స్వశక్తి స్వస్థనారీ పరివార్

ప్రజాశక్తి - నాయుడుపేట: కూటమి ప్రభుత్వం అందిస్తున్న సేవలను మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని అమృతమ్మ పేర్కొన్నారు. నాయుడుపేట మండలం, భీమవరంలో శనివారం స్వశక్తి స్వస్థనారీ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న భీమవరం గ్రామ సర్పంచ్ నెలవల అమృత, సరళమ్మలు మాట్లాడుతూ ఆరోగ్యకరమైన మహిళలు, బలమైన కుటుంబాల కోసం ప్రభుత్వం అవగాహన శిబిరాలు ఏర్పాటు చేయడం చాలా సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శంకరయ్య, ఐసిడిఎస్ అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామ ఉపసర్పంచ్, ఏఎంసి డైరెక్టర్ గోను బాబు పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పంచాయతీ విభజనకు తీర్మానం

ప్రజాశక్తి - బాలాయపల్లి : మండలం పరిధి, పెరిమిడి పంచాయతీలోగల మేల్చూరు, సిసి కండ్రిగ గ్రామాలను పంచాయతీగా ఏర్పాటు ఏర్పాటు చేయాలనీ శనివారం సర్పంచ్ పూడేటి వనమ్మ అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి అర్ముగం మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రజల అభిప్రాయాలు సేకరణ కోసం పెరిమిడి గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సభ నిర్వహించి ఓటింగ్ నిర్వహించగా ఓటింగ్ లో పాల్గొన్న 65 మంది అంగీకారం తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రవీంద్రమ్మ, పంచాయతీ వార్డ్ మెంబర్లు, పంచాయతీలోని గ్రామాలు ప్రజలు పాల్గొన్నారు.

తగ్గిన జీఎస్టీపై అవగాహన

ప్రజాశక్తి - చిట్టమూరు: చిట్టమూరు తహశీల్దారు కార్యాలయంలో శనివారం ఎమ్మార్వో నరేష్ ఆధ్వర్యంలో దుకాణ యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈరోజు నుంచి కొత్త జీఎస్టీలను అనుసరిస్తూ అమ్మకాలు చేయాలని దుకాణ యజమానులకు సూచించారు. నిత్య అవసర సరుకులు, ఔషధాలకు సంబంధించి ఏ మేరకు పన్నులు తగ్గాయో వివరించారు. ఇందులో ఏ విధమైన సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని లేదా ఎంపీడీవో అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో సుధ, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

BEFORE THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT TIRUPATI
PRESENT: Sri. G. SREERAM KUMAR
ARC. NO. 11 of 2023

M/s Shriram Raghavendra Chits Pvt. Ltd., Tirupati Branch Rep.by its Jr. Manager/ Authorized Person, ...Disputant

Vs.

Mrs. T.Vallemma & Others ...Opponents

NOTICE TO OPPONENTS NO. 5 & 6

Opponent 5) Sri J Srinivasa Raju, S/o J. Sanjeevaiah, D.No:15-30, Padmavathi Nagar, M.R.Palli, Tirupati.
Opponent 6) Sri J Ganesh Ranadeer S/o J Srinivasa Raju, D.No:15-30, Padmavathi Nagar, M.R.Palli, Tirupati.

Whereas the above-named petitioner has made an application for reference of the dispute with regard to non-payment of subscription U/s 32 of Chit Fund Act, 1982 for the Chit series **80016/31** Which was sanctioned bearing prior sanction order No. **135/2019** dated on **13th day of November 2019** to be examined under the provisions of section 64 of Chit Fund Act, 1982. As on the date of filing disputed claim is **Rs. 3,38,613/-**
You are hereby directed to appear before the Deputy Registrar of Chits/Arbitrator, Tirupati, in person duly on date **04-10-2025 at 10.30 A.M.**
Hearing Date: 04.10.2025
By Order of Dy. Register of Chits
O/o The District Registrer of Chits
Tirupati District Office, Tirupati

BEFORE THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT TIRUPATI
PRESENT: Sri. G. SREERAM KUMAR
ARC. NO. 110 of 2024

M/s Shriram Raghavendra Chits Pvt. Ltd., Tirupati Branch Rep.by its Jr. Manager/ Authorized Person, ...Disputant

Vs.

Mrs. R Govindamma & Others ...Opponents

NOTICE TO OPPONENTS NO. 1 & 2

Opponent 1) Mrs. R.Govindamma W/o. R.Babu, D.No.18-1-744, Bhavani Nagar, Tirupati Urban, Tirupati (Dist). Cell:9676567255.
Opponent 2) Mr. K.Lokanadham S/o Late K.Krishna Reddy, D.No.C-1-152, Dakshina Veedhi, Rajunta (A.M.Puram), Sathyavedu(M), Tirupati (Dist).

Whereas the above-named petitioner has made an application for reference of the dispute with regard to non-payment of subscription U/s 32 of Chit Fund Act, 1982 for the Chit series **56006/33** Which was sanctioned bearing prior sanction order No. **278/2017** dated on **30/10/2017** to be examined under the provisions of section 64 of Chit Fund Act, 1982. As on the date of filing disputed claim is **Rs. 35,811/-**
You are hereby directed to appear before the Deputy Registrar of Chits/Arbitrator, Tirupati, in person duly on date **04-10-2025 at 10.30 A.M.**
Hearing Date: 04-10-2025
By Order of Dy. Register of Chits
O/o The District Registrer of Chits
Tirupati District Office, Tirupati

కలప దోపిడీ.. పట్టించుకునే నాథుడేడీ..?

- అధిక లోడ్‌తో వాహనాలు
- నిమ్మకు నీరెత్తినట్లు అధికారులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు, వడమాలపేట మండలాలలో ప్రతి రోజు అక్రమంగా యధేచ్ఛగా కలప రవాణా సాగుతోంది. దీనిపై చర్యలు తీసుకోవాల్సిన అటవీ అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా కలప రవాణా జరుగుతుండటంపై స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ అక్రమ రవాణాపై అటవీ శాఖ అధికారులను ప్రశ్నిస్తే మాకు సంబంధం లేదని, రెవెన్యూ అధికారులే చూడాలని చేతులెత్తేశారు. రెవెన్యూ అధికారులను వివరాలు అడిగితే తమకు సంబంధం లేదని తేల్చి చెప్పేశారు. పుత్తూరు మండల పరిధిలోని వినాయక పురం,తిరుమల కుప్పం, కెబిఆర్ పురం, చిన్నబ్బనాయుడు కండ్రిగ, వడమాలపేట మండల పరిధిలోని సీతారామపురం, బాలనాయుడు కండ్రిగ, ఎస్.బి.ఆర్ పురం, బట్టి కండ్రిగ, ఎస్వీపురం మొదలగు గ్రామాల్లో ప్రతి రోజూ కలపను పెద్ద ట్రాక్టర్లలో అధిక మొత్తంలో లోడ్ చేసుకుని వెళుతున్నారు. అది కూడా బాగా రద్దీ సమయంలో ట్రాక్టర్ల ద్వారా తరలిస్తుంటారు. ఇలా అధిక లోడుతో ఎర్రటీ జెండాలు, రేడియం స్టిక్కర్స్ ఎలాంటివి లేకుండా వెళుతున్న ట్రాక్టర్లు అదుపుతప్పితే భారీ ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి.

నేల కూలుతున్న వృక్షాలు

సాధారణంగా కలపను ఒక చోట నుండి మరొకచోటకు తరలించడానికి అటవీశాఖ వారి అనుమతులు ఖచ్చితంగా తీసుకోవాలి. అలాగే అధిక లోడు ఉందా, లేదా అని చెక్ చేయాల్సిన భాధ్యత కూడా అధికారుల మీద ఉంది. పుత్తూరు మండల పరిధిలోని అధికారులు మాత్రం ఇందుకు బిన్నంగా వ్యవహరిస్తున్నారు. కొంతమంది ఏకంగా మా సొంత భూమిలో ఉన్న కలపను తరలిస్తున్నామని చెప్పకుంటూ లక్షల విలువ చేసే చెట్లను, పచ్చదనాన్ని నేలకూల్చుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన విధంగా చర్యలు తీసుకోవాల్సినవసరం ఎంతైన ఉందని స్థానిక ప్రజలు కోరుతున్నారు.